సందడే సందడి

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- అధికార, ప్రతిపక్ష నేతల ఇళ్ల వద్ద క్యూకట్టిన జనం


పెనుకొండలో మంత్రి సవితకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు


పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పల్లె రఘునాథ రెడ్డికి శుభాకాంక్షలు


ఎంపీ బీకే పార్థసారథికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డె అంజినప్ప


ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గుండుమల తిప్పేస్వామి


కదిరిలోని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇంట్లో సంబరాలు

పుట్టపర్తి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాది వేడుకలు జిల్లా వ్యాప్తంగా బుధవారం కోలాహలంగా సాగాయి. 2025 సంవత్సరానికి జిల్లా ప్రజలు కోటి ఆశలతో స్వాగతం పలికారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బుధవారం ఉదయం నుంచి జిల్లాలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద కూటమి నేతలు, కార్యకర్తలతోపాటు అధికారులు.. శుభాకాంక్షలు తెలుపడానికి క్యూకట్టారు. పెనుకొండలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి ఇళ్ల వద్దకు ఉదయం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి పెద్దఎత్తున తరలివచ్చారు. రామగిరి మండలం వెంకటాపురంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూ



రారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఇళ్ల వద్దకు కూటమి శ్రేణులు భారీగా తరలిరావడతో సందండిగా మారింది. కదిరిలో ఎమ్మెల్యే కందికుట వెంకటప్రసాద్ పుట్టినరోజు కూడా కావడంతో శుభాకాంక్షలు చెప్పడానికి కూటమి నేతలు పోటెత్తడంతో జాతరలా సాగింది. మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామికి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, హిందూపురంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు వడ్డె అంజినప్పకు కూటమి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. పెనుకొండలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష, మాజీ మంత్రి శంకరనారాయణ, హిందూపురంలో సమన్వయకర్త దీపిక, వైసీపీ నేత నవీన్‌నిశ్చల్‌పాటు వేసీపీ మాజీ ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ఆ పార్టీ శ్రేణులు సందడి చేశారు. పుష్పగుచ్ఛాలు, స్వీట్లు, పండ్లు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. యవత, ప్రజలు మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు దాటాక కేక్‌లు కట్‌చేసి, వీధుల్లో నృత్యాలు చేస్తూ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా చేసుకున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి నివాళిగా ఏడు రోజులు సంతాప దినాలుగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకలకు జిల్లా అధికార యంత్రాంగం దూరంగా ఉండిపోయింది.


హిందూపురంలో పోలీసుల సంబరాలు

ప్రశాంతి నిలయంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పుట్టపర్తి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాది వేడుకలను స్థానిక ప్రశాంతి నిలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేద పఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. హయ్యర్ సెకండరీ విద్యార్థులు సత్యసాయి అష్టోత్తర నామావళి పఠించారు. బ్రాస్‌బాండ్, సన్నాయినాదంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం విద్యార్థులు 'స్వమేవ శరణం మమ' నాటికను ప్రదర్శించారు. ఈ ఏడాది నవంబరులో నిర్వహించే సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలకు సంబంధించిన లోగోను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి ఆవిష్కరించారు. శతజయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించనున్నారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. నూతన సంవత్సర వేడుకల్లో దేశవిదేశాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి


సాయి విద్యార్థుల సంగీత ప్రదర్శన


నాటికలో ఓ సన్నివేశం



సత్యసాయి శత జయంత్యుత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

ఆలయాలు కిటకిట

కదిరి, జనవరి1(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాదితోపా ధనుర్మాసం కావడంతో పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి ధ్వంజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. లేపాక్షిలోని ఏకశిలా నందివిగ్రహం, దుర్గావీరభద్ర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.


ఖాద్రీశుడి దర్శనానికి వేచివున్న భక్తులు

రైటర్లదే రాజ్యం..!

స్టేషన్లలో ఫిర్యాదులు.. బయటకెళ్లి సెటిల్‌మెంట్లు..



చాలాచోట్ల ఇదే తంతు..

కొన్నిచోట్ల సీఐలు, ఎస్‌ఐలను డమ్మీ చేస్తున్న వైనం





హిందూపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆపదలో సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన బాధితులకు న్యాయం చేయాల్సిన కొంతమంది పోలీసులు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇందులో సింహభాగం సంబంధిత పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న రైటర్లదేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే రైటర్లు ఆ స్టేషన్లకు కింగ్ మేకర్లుగా నిలుస్తున్నారు. స్టేషన్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను ఎఫ్ఐఆర్ చేయాల్సిన బాధ్యతను సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు అక్కడ పనిచేసే రైటర్లకు అప్పజెబుతారు. ఎఫ్ఐఆర్ ఎలా కట్టాలో వారికే ఎరుక. దీంతో ఎఫ్ఐఆర్ బలంగా ఉండాలన్నా, బలహీనంగా ఉండాలన్నా రైటర్ల మీదే ఆధారపడి ఉంటుంది. పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదయ్యాక కొంతమంది ఎస్‌హెచ్‌ఓలు సంతకం పెడుతున్నారు తప్ప.. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులు ఏంటి, ఎఫ్ఐఆర్ నమోదు చేసిందేమిటనేది చూడట్లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో అలాంటి కేసులు కోర్టుదాకా వెళ్లినా బాధితులకు న్యాయం దక్కదు. దీంతో స్టేషన్‌కు వెళ్లిన బాధితులు, నిందితులు రైటర్లమీదే ఆధారపడుతున్నారన్న చర్చలు వినిపిస్తున్నాయి. అలా.. పోలీసు స్టేషన్‌లో రైటర్ల రాజ్యం నడుస్తోందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ తంతు ఒక స్టేషన్, సబ్‌డివిజన్‌కు మాత్రమే పరిమితం కాలేదు. జిల్లావ్యాప్తంగా అధిక శాతం పోలీసు స్టేషన్లలో సాగుతోందన్నది బహిరంగ రహస్యమే. సంబంధిత స్టేషన్లలో రైటర్లు చెప్పిందే వేదంగా మారుతోంది. అంతేకాదు, కొన్నిచోట్ల సీఐలు, ఎస్‌ఐలను సైతం రైటర్లు డమ్మీలు చేస్తున్నారంటే వారు ఏ స్థాయిలో స్టేషన్‌ను తమ గుప్పిట్లో పెట్టుకున్నారో అర్థం చేసుకోవచ్చు.

సెటిల్‌మెంట్లతో సరి..

కొంతమంది బాధితులు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తారు. ఎవరిమీద ఫిర్యాదు చేశారో వారిని పిలిపిస్తామని ఎస్‌హెచ్‌ఓ చెబుతారు. ఫిర్యాదు కాపీ.. రైటర్ చేతికి వెళ్తుంది. ఆ వెంటనే సంబంధిత రైటర్ చేసే మొదటి పనేంటంటే ఫిర్యాదుదారులు ఎవరిపై కంప్లైంట్ ఇచ్చారో వారిని లైన్లోకి తీసుకుంటారు. అంతటితో ఆగకుండా స్టేషన్ వద్దకు వస్తే అందరికీ తెలుస్తుందని చెప్పి వారిని బయటకు పిలిపించుకుని పంచాయితీ పెడుతున్నట్లు తెలుస్తోంది. సెటిల్‌మెంట్ ఓకే అయితే ఒకలా ఎఫ్ఐఆర్, వారి గీటురాయికి రాకపోతే మరోలా నమోదు చేస్తున్నారు. దీంతో కొంతమంది స్టేషన్ వరకు ఎందుకని రైటర్లను లోబరుచుకుని వారికి కొంత ముట్టజెప్పి సంబంధిత సీఐ, ఎస్‌ఐలు పిలిపించే సరికి అందుకు తగ్గట్టుగా రైటర్లు.. ఎస్‌హెచ్‌ఓలకు చెప్పి కేసును తారుమారు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



చాలాచోట్ల ఇదే తంతు..

జిల్లాలో చాలా పోలీసు స్టేషన్లలో రైటర్లే కింగ్ మేకర్లుగా వ్యవహరిస్తున్నారు. హిందూపురం సబ్‌డివిజన్‌లోని ఓ పోలీసు స్టేషన్‌లో ఓ అధికారి నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. అక్కడ పనిచేసే రైటర్ మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎవరైనా స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారిని హోల్డ్‌లో పెట్టి ఎవరిపై కంప్లైంట్ చేశారో వారిని స్టేషన్ బయటకు పిలిపించి, సెటిల్‌మెంట్ చేస్తున్నారు. ఈ సందర్భంలో కొన్ని కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లనే తారుమారు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భూమికి సంబంధించిన విషయంలో కొంతమంది నాయకులు, బాధితులు వెళ్లి ఒక అధికారి మీద సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ పనిచేస్తున్న రైటర్ ఎవరి మీద ఫిర్యాదు చేశాడో అతడిని పిలిపించుకుని మాట్లాడుకున్నారు. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు పక్కనబెట్టి ఆయన మరోరకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో ఎవరిమీద ఫిర్యాదు చేశారో సదరు వ్యక్తి మీద కేసు మోయనీయకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సంబంధిత బాధితులు.. ఓ ప్రజాప్రతినిధి ఇంటికెళ్లి గోడు వెల్లబోసుకున్నారు. ఈ కేసులో సదరు రైటర్ పెద్దమొత్తంలో వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల సదరు రైటర్ మీద మరికొన్ని ఫిర్యాదులు కూడా వెళ్లాయి. ఇదే సబ్‌డివిజన్‌లో ఓ మండల పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న రైటర్.. సంబంధిత ఎస్‌ఐను డమ్మీచేసి అంతా తానై వ్యవహరిస్తున్నాడు. సదరు ఎస్‌హెచ్‌ఓకి ఎఫ్ఐఆర్‌పై పూర్తి అవగాహన లేకపోవడంతో రైటర్ చెప్పిందే వేదంగా సాగుతోంది. పెనుకొండ సబ్‌డివిజన్‌లోని తూర్పుమండల పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న రైటర్ అక్కడ సీఐ, ఎస్‌ఐలను డమ్మీచేసి, స్టేషన్‌లో అన్నీతానై వ్యవహరిస్తున్నాడు. మడకశిర నియోజకవర్గంలోని ఓ మండల పోలీసు స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓలు తరచూ బదిలీ అవుతుండటంతో అక్కడ పనిచేసే రైటరే కింగ్‌లా వ్యవహరిస్తున్నారు.

సీఐలు, ఎస్‌ఐలను డమ్మీ చేస్తున్న వైనం

స్టేషన్‌లో పనిచేసే రైటర్లు సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను డమ్మీలుగా మారుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. స్టేషన్ ఖర్చులు, ఇతరత్రా వ్యవహారాలు అధికశాతం రైటర్ల మీదే వదిలేసి ఉంటారు. దీంతో కొన్నిచోట్ల సీఐలు, ఎస్‌ఐలు డబ్బుల వ్యవహారం రైటర్లకే అప్పగించి ఉంటారు. ఆ మేరకు వారికి తెలిసి కొంత.. తెలియకుండా మరి కొంత వసూలు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగా ఎస్‌హెచ్‌ఓల పనితీరు, వారి వ్యవహారాలను ఆసరాగా చేసుకున్న రైటర్లు అంతా తామై వ్యవహరిస్తున్నారు. ఎస్‌హెచ్‌ఓలను కొన్నిచోట్ల బలహీన పరుస్తున్నట్లు తెలుస్తోంది. గత నెలలో ఓ సబ్‌డివిజన్‌కు సంబంధించి రైటర్ మీద ఎస్‌ఐ.. జిల్లా స్థాయి అధికారికి ఫిర్యాదు చేశారు. ఆయన తన దారిలో లేరనీ, ఆయన వెళ్తే వచ్చే రైటర్ ఎలా ఉంటారో తెలియక ఆయననే కొనసాగిస్తున్నాననీ, దీనిని అలుసుగా తీసుకుని, హద్దుమీరి వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. దీనిని బట్టి రైటర్లు.. పోలీసు స్టేషన్‌లో ఎలా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది. ఇదే తరహా తంతు కొన్ని డీఎస్పీ కార్యాలయాల్లో సైతం సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ రైటర్ కాకుండా సీసీలు.. సీఐలు, ఎస్‌ఐల మీద స్వారీ చేస్తున్నారు. బందోబస్తు సమయాల్లో వారికి నచ్చిన వారిని పక్కనబెట్టి కొంతమంది సిబ్బందిపై ఉద్దేశపూర్వకంగా బందోబస్తుకు వేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏది ఏమైనా పోలీసు స్టేషన్‌లో రైటర్లే రాజ్యమేలుతున్నట్లు తెలుస్తోంది.



దూసుకెళ్లిన కారు

- విద్యుత్‌స్తభాన్ని ఢీకొట్టిన వైనం
- ముక్కలైన స్తంభం
- ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో వాహనంలోని వారు సురక్షితం


కారు ఢీకొనడంతో కూలిన విద్యుత్ స్తంభం.., ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ధర్మవరం రూరల్, జనవరి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడంపల్లి క్రాస్ సమీపాన స్పీడుబ్రేకర్ల వద్ద మంగళవారం రాత్రి కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి, విద్యుత్‌స్తంబాన్ని ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ధర్మవరం పట్టణానికి చెందిన బాబు కుటుంబసభ్యులు అనంతపురం నుంచి స్వగ్రామానికి అర్ధరాత్రి కారులో బయల్దేరారు. గరుడంపల్లి సమీపంలోకి రాగానే మలుపు వద్ద అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అక్కడే ఉన్న 33కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం విరిగిపోయి, ముక్కలైంది. కారు ఎయిర్ బ్యాగులు ఓపెన్‌కావడంతో అందులో ఉన్న ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కారు నుజ్జనుజ్జయింది. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో చేతికి అందే ఎత్తులో విద్యుత్‌వైర్లు ఒరిగిపోయాయి. రూరల్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని తెలిసింది.

తగ్గిన మద్యం ఆదాయం

ఉమ్మడి జిల్లాలో ఒక్క రోజులో రూ.5.46 కోట్ల విక్రయాలు

- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన అమ్మకాలు
- 30న భారీగా కొనుగోలు చేయడమే కారణం



గాలిలో ప్రాణాలు




కొత్తపేట రహదారిలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు


పోతుకుంట రైల్వేబ్రిడ్జిపై బైక్‌లో వెళ్తున్న నలుగురు

రైల్వేబ్రిడ్జిపై బైక్‌లో దూసుకెళ్తున్న యువకులు

ద్విచక్రవాహన ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. బైక్‌లు బోల్తాపడి, ఢీకొని చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఎందరో తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. కాళ్లు, చేతులు పోగొట్టుకుంటున్నారు. అయినా.. జనంలో మాత్రం మార్పు రావట్లేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రాణాలు కాపాడుకోవాలని పదేపదే చెబుతున్నా పట్టించుకునే వారే లేరు. బైక్‌పై ముగ్గురు, నలుగురు దూసుకెళ్తున్నారు. ధర్మవరంలోని కొత్తపేట, టూటౌన్, వన్‌టౌన్ పోలీసు స్టేషన్ల ఎదుట, కళాజ్యోతి సర్కిల్ మీదుగా బైక్‌పై బుధవారం నలుగురు వెళ్లారు. చిన్నారులను ఎక్కించుకుని హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేస్తున్నారు. పోలీసు స్టేషన్ల ముందు నుంచే వెళ్తున్నా పోలీసులు పట్టించుకోవడం శోచనీయం.

-ధర్మవరం రూరల్(ఆంధ్రజ్యోతి)



తగ్గిన మద్యం ఆదాయం



ఉమ్మడి జిల్లాలో ఒక్క రోజులో
రూ.5.46 కోట్ల విక్రయాలు

- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన అమ్మకాలు
- 30న భారీగా కొనుగోలు చేయడమే కారణం

అనంతపురం జిల్లాలో 2019 నుంచి చివరి రోజు విక్రయాలు

సంవత్సరం	లిక్కర్ కేస్‌లు	బీర్ కేస్‌లు	మొత్తం విలువ (రూ.కోట్లు)
2019	4054	2738	3,76,56,760
2020	2626	1675	3,33,13,470
2021	3596	2099	4,14,34,640
2022	3720	2262	4,43,56,010
2023	3888	2766	5,00,00,000
2024	5281	1465	3,87,00,000

శ్రీసత్యసాయి జిల్లాలో 2019 నుంచి చివరిరోజు విక్రయాలు

సంవత్సరం	లిక్కర్ కేస్‌లు	బీర్ కేస్‌లు	మొత్తం విలువ (కోట్లల్లో)
2019	2098	2005	1,99,23,160
2020	1371	1023	1,75,61,570
2021	1828	1160	2,07,07,170
2022	1870	1387	2,12,60,340
2023	1880	1415	2,46,00,000
2024	2030	1080	1,59,00,000

అనంతపురం అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గత ఏడాది కంటే ఈసారి నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా మద్యం విక్రయాలు తగ్గినట్లు అధికారులు పేర్కొన్నా రు. అయితే ఒక రోజు ముందే అ ధి క ం గా విక్రయాలు జరగడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. గత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ మంగళవారం యువత తమ స్నేహితులతో కలిసి మద్యం తాగి ఊగారు. నూతన సంవత్సరం 2025ను స్వాగతిస్తూ కొందరు అర్ధరాత్రి కేక్‌లు కట్ చేసుకొని సంబరాలు చేసుకోగా, ఎక్కువ శాతం యువత మద్యం విందులతో మత్తులో మునిగితేలారు. అర్ధరాత్రి 12 వరకు మద్యం షాపులు, ఒంటి గంట దాకా బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతించడంతో మద్యం ప్రియులతో కిటకిటలాడాయి. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మందుబాబులు సైతం సాధారణంగా తాగే స్థాయి కంటే రెండు పెగ్‌లు అదనంగా తాగేశారు. 2024 డిసెంబరు ఆఖరు రోజు అనంత జిల్లాలో 3.87 కోట్ల విలువైన మద్యం, బీర్ల విక్రయాలు జరిగాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో 1.59 కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో ఒక్క రోజులో రూ.5.46 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. అలాగే 2023 సంవత్సరం డిసెంబరు ఆఖరు రోజు అనంత జిల్లాలో రూ.5కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 2.46 కోట్ల మద్యం విక్రయించారు. అనంత ఉమ్మడి జిల్లాలో ఒక్క రోజులో రూ.7.46 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఆఖరు రోజు ఈ సారి ఉమ్మడి జిల్లాలో రూ.2 కోట్ల మద్యం విక్రయాలు తగ్గాయి. కాగా ఉమ్మడి జిల్లాలో సాధారణ రోజుల్లో ప్రతి రోజు రూ.4 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఐఎంఎల్ డిపో అధికారులు పేర్కొన్నారు. ఈ సారి డిసెంబరు 30న ఒక్క రోజే ఏకంగా రూ.12.15 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు పేర్కొన్నారు. డిసెంబరు 31వతేదీకి ఒక రోజు ముందే న్యూ ఇయర్ వేడుకల కోసం మద్యం కొనుగోలు చేయడంతోనే అత్యధికంగా ఆ రోజు మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు అనంత జిల్లాలో ఎక్కువ శాతం యువత డిఫెన్స్ మద్యం, కర్ణాటక, తెలంగాణ, గోవా ప్రాంతాల నుంచి ముందస్తుగా మద్యం తెచ్చుకోవడం ద్వారానే ఈ సారి ఆఖరు రోజు ఉమ్మడి జిల్లాలో మద్యం విక్రయాలు తగ్గినట్లు సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ఎక్కువ శాతం మంది కర్ణాటక మద్యాన్ని తీసుకోవడం ద్వారా ఆ జిల్లాలో ఈ సారి మద్యం విక్రయాలు తగ్గినట్లు సమాచారం.

ఒక రోజు ముందే ఎక్కువ మద్యం విక్రయాలు

ఈ ఏడాది డిసెంబరు 31వతేదీకి ఒక రోజు ముందే మద్యం విక్రయాలు భారీ జరిగాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతి రోజూ సాధారణ రోజుల్లో రూ.4 కోట్ల దాకా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకుని డిసెంబరు ఆఖరు రోజు కంటే ఒక రోజు ముందు డిసెంబరు 30వతేదీ ఒక్క రోజులో రూ.12.15 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే డిసెంబరు ఆఖరు రోజు మద్యం విక్రయాలు తగ్గినా.. ఆ ముందు రోజు మద్యం విక్రయాలు పెరిగాయి.

- బి. వెంకటనాయుడు, అనంతపురం ఐఎంఎల్ డిపో మేనేజర్

పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు

గడువు పూర్తి

అనంతపురం అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువు మంగళవారంతో ముగిసింది. వాతావరణ ఆధారిత బీమాకు సంబంధించి మామిడి పంటకు ఎకరాకు రైతు వాటా రూ.1650 చెల్లిస్తే రూ.33వేలు, టమోటా పంటకు ఎకరాకు రూ.1600లు చెలిస్తే రూ.32వేల బీమాను వర్తింపజేయాలని నిర్ణయించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమాకు సంబంధించి వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480లు చెలిస్తే రూ.32వేలు, జొన్న పంటకు ఎకరాకు రూ.315లు చెలిస్తే రూ.21వేలు, మొక్కజొన్నకు ఎకరాకు రూ.525లు చెలిస్తే రూ.35వేలు, వరి పంటకు ఎకరాకు రూ.630లు చెలిస్తే రూ.42వేలు, పప్పుశనగ పంటకు ఎకరాకు రూ.450లు చెల్లిస్తే రూ.30వేల బీమా మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించారు. ఈ ఏడాది రబీసీజన్‌కు సంబంధించి వాతావరణ బీమా కింద 1189 రైతులు 1711.04 హెక్టార్లకు ప్రీమియం చెల్లించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమా కోసం 21540 మంది రైతులు 35270.77 హెక్టార్లకు ప్రీమియం చెల్లించారు. రెండింటికి కలిపి 36981.81 హెక్టార్లకు ప్రీమియం చెల్లించారు. రబీ సీజన్‌లో బ్యాంక్‌లో రుణం తీసుకునే రైతులు చాలా తక్కువ. బ్యాంక్‌లో రుణం తీసుకోని రైతులే ఎక్కువగా ఉండటంతో రుణం తీసుకోని రైతులు ఎక్కువ శాతం మంది బయట ప్రీమియం చెల్లించలేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రీమియం శాతం తగ్గినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొన్నారు.

తండ్రిని హత్య చేసిన కొడుకు

తల్లిని వేధిస్తున్నందుకు..



ఆదినారాయణ మృతదేహం

బుక్కరాయసముద్రం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో తండ్రి ఆదినారాయణ(54)ని కన్నకొడుకే రోకలిబండతో కొట్టి హత్య చేసిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. మద్యం సేవించి రోజు తల్లిని వేధిస్తున్న నేపథ్యంలో హత్య జరిగినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నంపల్లి గ్రామానికి చెందిన హరిజన ఆదినారాయణ భార్య సులోచనలు కూలి పని చేసుకుని జీవించేవారు. వారికి నాగార్జున అనే కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా ఆదినారాయణ మద్యం సేవించి ప్రతి రోజు భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో కుమారుడు నాగార్జున పలుమార్లు తన తల్లిని వేధించవద్దని తండ్రికి హితవు చెప్పాడు. అయినా మార్పు రాలేదు. ఈక్రమంలోనే బుధవారం మద్యం సేవించి వేధిస్తుండటంతో తండ్రితో కుమారుడు గొడవ పడ్డాడు. ఈక్రమంలోనే ఇంట్లో ఉన్న రోకలిబండను తీసుకుని ఆదినారాయణ తలపై మోదాడు. దీంతో తీవ్రంగా గాయపడి ఆయన మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని సీఐ పరిశీలించారు. నిందితుడు నాగార్జున కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కేవీకేల నిర్మాణం పూర్తి చేయండి

2014-19 మధ్య 19 స్టేడియాల మంజూరు

పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

కలగానే మిగిలిపోతున్న స్టేడియాలు

ఆటల కోసం...





అన్నింటికీ ఈ ఒక్కటే దిక్కు. (అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియం)



ఉరవకొండలో పిల్లర్లకు పరిమితమైన క్రీడా వికాస కేంద్ర భవనం



ఐదేళ్లుగా నిర్మాణ పనులు ఆగిపోయిన కల్లూరులోని కేవీకే స్టేడియం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి1: జిల్లాకు మంజూరు చేసిన క్రీడా వికాస కేంద్రాల(కేవీకే) నిర్మాణాలు పూర్తి చేయాలని క్రీడాభిమానులు కోరుతున్నారు. టీడీపీ అధికారంలో ఉన్న 2014-19 మధ్య కాలంలో ఉమ్మడి జిల్లాకు 19 స్టేడియాలు మంజూరు చేసింది. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి నార్పల, కళ్యాణదుర్గం, రామగిరి ప్రాంతాలలోని క్రీడా వికాస కేంద్రాల నిర్మాణం పూర్తి చేసింది. చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ, కల్లూరు ప్రాంతాలలోని స్టేడియాలు గత ఐదేళ్ల కాలంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ఇక ఆత్మకూరు, అనంతపురం, శింగనమల ప్రాంతాలకు మంజూరు చేసిన కేవీకేలను గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. మిగిలినవి అతీగతి లేకుండాపోయాయి. ఒక్కో స్టేడియానికి రూ.2కోట్ల చొప్పున గత ప్రభుత్వం నిధులు సైతం కేటాయించింది. అయితే వాటి నిర్మాణం పూర్తి కాలేదు. గత వైసీపీ పాపం కేవీకేలకు చుట్టుకుందని పలువురు విమర్శిస్తున్నారు.

క్రీడా అకాడమీలను ఏర్పాటు చేయాలి



జిల్లా కేంద్రంలో క్రీడా అకాడమీలు ఏర్పాటు చేయాలని అనేకమార్లు తోటి క్రీడాకారులతో కలిసి అధికారులకు విన్నవించాం. ఐదేళ్లపాటు అకాడమీలు, స్టేడియాల గురించి అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. స్టేడియం నిర్మించి, అకాడమీలు ఏర్పాటు చేసి, సదుపాయాలు కల్పించి ప్రోత్సాహం అందిస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు తెచ్చి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చే నైపుణ్యం గల యువత జిల్లాలో ఉంది. - సాయిస్వరూప, క్రీడాకారిణి

అవుట్‌డోర్ స్టేడియం నిర్మించాలి



అనంతపురంలో ఎన్నోఏళ్లుగా ఎదురు చూస్తున్న భారీ అవుట్‌డోర్ స్టేడియం నిర్మించాలి. గత వైసీపీ ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులను మరిచిపోయింది. ఐదేళ్లపాటు క్రీడాశాఖను నిర్వీర్యం చేసింది. 2014-19 మధ్య కాలంలో అధికారంలో ఉన్న అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిన స్టేడియాలను, అకాడమీలను రద్దు చేయడం దుర్మార్గం. యువతకు క్రీడా సాధన, వ్యాయామానికి అనుగుణంగా తలమానికంగా స్టేడియం అవసరాన్ని గత వైసీపీ ప్రభుత్వం గుర్తించలేదు. - బాజీ చౌదరి, అనంతపురం

నిర్మాణం పూర్తి చేయాలి..



ఉరవకొండకు గత టీడీపీ ప్రభుత్వం స్టేడియం మంజూరు చేసింది. అప్పట్లో కొంత మేర నిర్మాణం చేపట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని పలుమార్లు అప్పటి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఉరవకొండలో క్రీడలు, వ్యాయామం చేయడానికి ఒక్కటి కూడా అనువైన ప్రాంతం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అర్ధంతరంగా నిలిచిపోయిన క్రీడా మైదానాన్ని వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తే ఫలితాలు సానుకూలంగానే ఉంటాయి. - నిరంజన్‌గౌడ్, ఉరవకొండ

త్వరలో నిర్ణయం..



స్టేడియాల నిర్మాణం, పూర్తి చేయడమన్నది ప్రభుత్వ పాలసీ. నూతనంగా వచ్చిన ప్రభుత్వం క్రీడా వికాస కేంద్రాలపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశముంది. ప్రస్తుతానికి జిల్లా కేంద్రంలో ఉన్న అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియం నుంచే అనేక క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన క్రీడాపాలసీ క్రీడలు, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఇచ్చే విధంగా ఉంది. క్రీడాపాలసీలోనే క్రీడా మైదానాల నిర్మాణం, ఇతర సదుపాయాల కల్పన చేపడతారని అందరూ ఆశిస్తున్నారు. అర్ధంతరంగా ఆగిపోయిన క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతాం. - ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీఓ

డివిజనల్ కేంద్రంలో విధుల్లో చేరిన డీఆర్‌ఎం సీఎస్ గుప్తా



విధుల్లో చేరిన డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, జనవరి1(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌కు బదిలీపై వచ్చిన డీఆర్‌ఎం సీఎస్ గుప్తా బుధవారం ఉదయం విధుల్లో చేరారు. ఇదివరకు ఇక్కడ డీఆర్‌ఎంగా పనిచేసిన విజయకుమార్ స్థానంలో సీఎస్ గుప్తా నియమితులైన విషయం విదితమే. ఈ మేరకు డీఆర్‌ఎం విజయకుమార్ మంగళవారం సాయంత్రం రిలీవ్ అయ్యి జోనల్ కేంద్రానికి వెళ్లారు. బుధవారం ఉదయం సీఎస్ గుప్తా చార్జ్ తీసుకున్నారు.

గుత్తికోటలో విదేశీ పర్యాటకులు



కోట పైభాగంలో సేదదీరుతున్న విదేశీ పర్యాటకులు

గుత్తి, జనవరి1(ఆంధ్రజ్యోతి): చరిత్ర కలిగిన గుత్తికోటలో లండన్‌కు చెందిన కొందరు బుధవారం పర్యటించారు. నూతన సంవత్సరం కావడంతో పట్టన ప్రజలు, ఇతరులు కూడా గుత్తికోటను సందర్శించారు. గతంలో పట్టణంలోని మాల్ఫ్‌స్మిత్ ఉన్నత పాఠశాల అధికారిగా పనిచేసిన దొర సంబంధీకులు రెవరెండ్ జీ మార్క్సడన్, ఆయన సతీమణి హన్నీమార్క్సడన్, కుమార్తె మిస్ లిజీ ఎలిజిబెత్ భారతి, క్రిష్టోఫర్ మార్క్సడన్‌లు కోటలో నలువైపులా తిరుగాడారు. ముందుగా ఆంగ్లేయుల సమాధులను పరిశీలించారు. తర్వాత హజరత్ సయ్యద్ బాషా దర్గా, గుర్రపుశాల, రాణిమహల్, ఖిల్లా వరకు తిలకించారు. కోట గైడ్ రమేష్, కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ గుత్తికోట చరిత్ర వారికి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంరక్షణ సమితి సభ్యులు కృష్ణయ్య, శివకుమార్, దాదు, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

తాగి గొడవకు వెళ్లి..!



చికిత్స పొందుతున్న నూర్‌మహ్మద్


హిందూపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ కాలనీ ఆటోస్టాండ్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గొడవపడ్డారు. శాంతినగర్‌కు చెందిన మహబూబ్ బాషా ఇంటికి వెళుతుండగా ఆటో స్టాండ్ వద్ద ఉన్న నూర్ మహ్మద్ అకారణంగా దాడిచేశాడు. దీంతో మహబూబ్ బాషా తన వద్ద ఉన్న కత్తితో నూర్ మహ్మద్‌ను ప్రతిదాడి చేశాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో తీవ్రంగా గాయపడిన నూర్ మహ్మద్‌ను పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నూర్ మహ్మద్ మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు తెలిపారు. వీరిద్దరి మధ్య గతంలో ఎలాంటి గొడవలు లేవని అన్నారు.

టమోటా కిలో రూ.10



అనంతపురం రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 8, కనిష్ఠ ధర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.25వేలు



అనంతపురం రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 25,190 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 25 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

జీడిపల్లికి 873 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 873 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 494 క్యూసెక్కుల వరద వెళుతోంది. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీరు ఉందని అధికారులు బుధవారం తెలిపారు.

న్యూస్ బాక్స్ ..

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

బత్తలపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక టీడీపీ కార్యకర్త సుధాకర్‌ను రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట్ల విజయకుమార్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట వాటర్ శ్రీరాములు, నాయడు ఉన్నారు.

బాధిత కుటుంబానికి...

ధర్మవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలో మంగళవార రాత్రి నాయిబ్రాహ్మణుడు ధనుంజయ విద్యుదాఘాతంతో మరణించిన విషయం తెల్సిందే. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీరమణ, కో కన్వీనర్ అయూబ్‌ఖాన్,ఎల్ ఆది నారాయణ,సెక్టార్ లీడర్స్ ఫాతిమా, చింతమ్మ బుధవారం ధనుంజయ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

7న విగ్రహ ప్రతిష్ఠ

ధర్మవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 9న ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలను ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు.

చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

ధర్మవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ చౌడేశ్వరి దేవి ఆలయంలో ధనుర్మాస పూజలు, నూతన సంవత్సరం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారికి పట్టువస్త్రాలు, వివిధరకాల పూలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



అలంకరణలో చౌడేశ్వరీదేవి

చెత్తను తొలగించండి

గాండ్లపెంట : స్థానిక తూపల్లి రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు తెప్పలుగా ఉంటోంది. పం చాయతీ కార్మికులు పలు వీధుల్లో చెత్త తొలగించడం లేదని, దీంతో చెత్త పేరుకుపోతోందని స్థానికులు వాపోతున్నారు. దీంతో పాటు కొంతమంది స్థానికులు చెత్తను విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ పారేస్తున్నారన్నారు. వీధులన్నీ చెత్తతో నిండిపోయి అపరి శుభ్రతతో పాటు దుర్వాసన వస్తోందని, ఇప్పటికైనా వీధుల్లో చెత్తను తొలగిం చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తూపల్లి ప్రధాన రహదారి పక్కన వేసిన చెత్త

శ్రీశైలం నుంచి నీరిస్తే అంతే చాలు..

హిందూపురం అర్బన్, జనవరి1(ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానం తీవ్ర శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని అనీ, తద్వారా రాయలసీమకు ప్రయోజనం కూడా అంతంత మాత్రమేనని జలసాధన సమితి ఉమ్మడి అనంత జిల్లా నాయకులు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం హర్షించదగ్గ విషయమేనని, ఎక్కడో పోలవరం నుంచి నల్లమల అడవుల్లో సొరంగ మార్గాలు, కాలువలు తవ్వాలంటే అధిక శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని అన్నారు. అన్నింటినీ పూర్తిచేసిన తరువాత నీరివ్వాలన్నా ఎన్నో ఇబ్బందులు తప్పవన్నారు. దాదాపు 800 కిలోమీటర్ల దూరం ఎత్తిపోతల ద్వారా కొండకోనల్లో నీరు తీసుకురావడం సాధ్యమేనా? అని ప్రశ్నించారు. రాయలసీమకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలనుకుంటే శ్రీశైలం డ్యాం నుంచి కాలువల ద్వారా నీరు ఇవ్వాలన్నారు. ఆ దిశగా కాలువలు వెడల్పు చేసి, అందుబాటులో ఉన్న జలాలను సక్రమంగా వినియోగిస్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. ఇప్పటికే ఏటా వందల టీఎంసీల కృష్ణాజలాలు సముద్రం పాలవుతున్నాయన్నారు. వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే చాలన్నారు. దీనిపై అన్ని రాజకీయపార్టీలు, మేధావులతో సమావేశం ఏర్పాటుచేసి, సీమకు వాటిల్లుతున్న అన్యాయాన్ని వివరిస్తామన్నారు. కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు ఓపీడీఆర్ శ్రీనివాసులు, ధనాపురం వెంకటరామిరెడ్డి, చైతన్య గంగిరెడ్డి, జమీల్, అమానుల్లా, ఉమర్‌ఫరూక్, బీఎస్పీ శ్రీరాములు, ఆదినారాయణ, పవన్, తిప్పేస్వామి, గిరీష్, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

ఆరేళ్లు అయినా..!

- ◆ కొత్తచెరువులో పూర్తికాని సీహెచ్‌సీ భవన నిర్మాణం
- ◆ పాత ఆస్పత్రిలోనే వైద్యసేవలు
- ◆ సౌకర్యాలు లేక ఆగిన కు.ని. ఆపరేషన్లు



నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనం

కొత్తచెరువు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో 30 పడకల సీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని రూ. 3.50 కోట్లతో ఆరేళ్ల క్రితం ప్రారంభించారు. నేటికీ ఆ పనులు పూర్తి కాకపోవడంతో పాత సీహెచ్‌సీ ఆస్పత్రిలో వైద్యులు సేవలు అందిస్తున్నారు. అందులో ఉన్న అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్నారు. రోజుకు 200 నుంచి 300 దాకా వివిధ రోగాలతో ఈ ఆస్పత్రికి వస్తుంటారు. ఒకే గదిలోనే ముగ్గురు డాక్టర్లు ఉంటూ రోగులకు వైద్య సేవలు అందిం చాల్సిన పరిస్థితి నెలకొంది. గదులు శిథిలా వస్థకు చేరుకుని పెచ్చులూడు తున్నాయి. దీంతో ఆస్పత్రి వరండాలోనే మంచాలు వేసి.. రోగులకు వాటిపై వైద్య సేవలు అందిస్తున్నారు. సీహెచ్‌సీలో ఎనిమిది మంది వైద్యులకు గాను.. ఏడు గురు ఉన్నారు. ఇలా సిబ్బంది కొరత లేకున్నా.. సరైన సౌకర్యాలు లేకపోవడంతో రోగులు సరిగా వైద్యు సేవలు అందడం లేదు.

● **సమస్యల తిష్ట**

పాత ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, అత్యవసర వైద్యచికిత్సలు అందడం లేదు. సాధారణ డెలివరీలు ఉన్నా.. ఆస్పత్రిలో థియేటర్‌లు లేకపోవడంతో పుట్టపర్తికి రెఫర్ చేస్తున్నారు. అదేవిధంగా సిజేరియన్ కోసం కూడా పుట్టపర్తికి రేఫర్ చేస్తున్నారు. 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో.. ఆ ఆస్పత్రికి సంబంధించిన వైద్యపరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. మండలానికి పీహెచ్‌సీ సెంటర్లు లేకపోవడంతో ఇక్కడున్న సిబ్బంది బుక్కపట్నంకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ రిపోర్ట్ చేసిన తరువాత కొత్తచెరువు మండలంలోని 13 సబ్ సెంటర్లకు హాజరుకావాల్సి వస్తోందని వైద్యసిబ్బంది వాపోతున్నారు. అదేవిధంగా మండలంలో గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు నెలసరి టీకాల కోసం 25కిలోమీటర్ల దూరంలోని బుక్కపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. మండలంలోని బైరాపురానికి పీహెచ్‌సీ గత ప్రభుత్వం మంజూరు చేసి.. తిరిగి రద్దుచేసింది. దీంతో పీహెచ్‌సీ సెంటర్ లేక అటు వైద్యసిబ్బంది.. ఇటు రోగులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా కొత్తచెరువు మండలంలో రెండు పీహెచ్‌సీలు మంజూరు చేయాలని, 30 పడకల ఆస్పత్రి భవణాన్ని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

ఆపరేషన్లు చేయలేకపోతున్నాం

భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో పాత ఆస్పత్రిలోనే వైద్యసేవలు అందిస్తున్నాం. సరైన సౌకర్యాలు లేకపోవడంతో సక్రమంగా వైద్య సేవలు అందించలేకపోతున్నాం. ఆపరేషన్ థియేటర్ పాతది కావడంతో దాన్ని ఉపయోగించుకోలేకపోతున్నాం. కుని ఆపరేషన్లు అత్యవసర ఆపరేషన్లు చేయలేకపోతున్నాం. భవన నిర్మాణం పూర్తయితే అన్ని వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

- అశ్వత్థకుమార్, వైద్యాధికారి





పాత ఆస్పత్రి వరండాలోనే రోగులకు వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం, నిరుపయోగంగా ఉన్న కొత్త ఆస్పత్రి కోసం మంజూరైన వైద్య పరికరాలు

ఘనంగా ఎమ్మెల్యే కందికుంట పుట్టినరోజు







ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న వాల్మీకి అనిల్‌కుమార్‌రెడ్డి, కొమ్మినేని గంగయ్యానాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

కదిరి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ జన్మదిన వేడుకలు బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఉదయం నుంచే అధికారులు, ప్రజా ప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు, ప్రజలు ఎమ్మెల్యేను కలిసి జన్మదిన, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, నాయకులు వాల్మీకి అనిల్‌కుమార్‌రెడ్డి, కొమ్మినేని గంగయ్యానాయుడు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. కాగా పట్టణం అంతా ఎమ్మెల్యే ఫ్లెక్సీలతో నిండిపోయింది.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు



వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌కు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న అభిమానులు



పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ధర్మవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధ వారం ఉత్సాహంగా నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యాలయాల్లో కూటమి నాయకులు కేక్‌లు కట్ చేశారు. వెంకటా పురంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవ రంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరి టాల శ్రీరామ్‌లకు అభిమానులు పార్టీ నాయ కులు నోట్ పుస్తకాలు, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ధర్మ వరంలోని టీడీపీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డికి, బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

● పుట్టపర్తిరూరల్: కూటమి పార్టీ కార్య కర్తలు, నాయకులు, ప్రభుత్వ అధికారులు, ప్రజలు పెద్దఎత్తున స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి పూలమొక్కలు, నోట్‌పుస్తకాలను అందచేసి నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలిపారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌కు ఆయన నివాసంలో పలువురు అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ కట్ చేశారు.

● నల్లమాడ: పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి మండ లానికి చెందిన పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



పుట్టపర్తి కోర్టులో కేక్‌కట్ చేస్తున్న న్యాయాధికారి రాకేష్

క్రైం న్యూస్ ..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

ధర్మవరం రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడన్నపల్లి గ్రామసమీపంలోని ప్రధాన రహదారిలో ఓ పల్సర్ బైకు అదుపుతప్పడంతో ముగ్గురు యువకులు బుధవారం రాత్రి తీవ్రంగా గాయపడ్డారు. ధర్మవరంలోని గీతానగర్‌కు చెందిన అంజి, వెంకటరమణ, కృష్ణ గార్లదిన్నె మండలం ముంటిమడుగుకు వెళ్లారు. బుధవారం రాత్రి ఆ ముగ్గురూ తిరిగి పల్సర్ బైక్‌పై ధర్మవరం బయలుదేరారు. మార్గమధ్యంలోని బడన్నపల్లి సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లారు. ఈ ప్రమాదంలో ఆ ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న వారు గమనించి.. 108కి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది గాయపడ్డవారిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

గాండ్లపెంట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కటారుపల్లి పంచాయతీ నుంచి ఇతర ప్రాంతాల్లో కోడిపందెలు ఆడెందుకు వెళ్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ వలీబాషా బుధవారం తెలిపారు. వారి నుంచి నాలుగు కోళ్లు, రూ.18వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

శ్రీవారికి వెండి ఆభరణాలు సమర్పణ

ధర్మవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామికి ఈనెల 10న జరిగే వైకుంఠ ఏకాదశికి దాతలు వెండికిరీటాన్ని అందజేశారు. బుధవారం ఆలయంలో దాతలు వజ్జల వెంకటరమణ బాబు కుమారులు స్వామివారికి రూ.1.10 లక్షల విలువ చేసే వెండి కిరీటం, వక్షస్థల మహాలక్ష్మీలను ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్‌కు అందజేశారు. స్వామి వారి పూజల్లో పాల్గొన్నారు.





వెండి కిరీటాన్ని అందజేస్తున్న దాతలు, వెండికిరీటం, వక్షస్థల మహాలక్ష్మి (ఇన్‌సెట్లో)

వరిరైతుకు తీరని నష్టం

- ఒకవైపు తెగుళ్లు .. మరో వైపు వాతావరణం
- వెరసి తగ్గిన దిగుబడి

తాడిమర్రి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఈ సారి కూడా వరి రైతు తీవ్రంగా నష్టపోయాడు. వరుస వానలు.. తదార్వా ప్రబలిన తెగుళ్లు.. పొగమంచు పంటను తీవ్రంగా నాశనం చేశాయి. ఖరీఫ్ ప్రారంభదశలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మొగ్గుచూపారు. వాటికి అనుకూలంగా కూడా వర్షం రాకపోవడంతో పూర్తిగా నష్టపోవాల్సివచ్చింది. కనీసం వరి పంట చేతికి తక్కుతుందని ఆశలు పెంచుకున్న రైతులకు.. చివరకు నిరాశే మిగిలింది. ఫెంగల్ తుఫాను బారి నుంచి బయటపడే లోపే మరో తుపాన్ వచ్చింది. దీంతో వాతావరణం పూర్తిగా మారింది. వరిపంట కోతకోసిన రైతు ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఒకవైపు కూలీలు దొరక్క యంత్రాలతో పంటలు నూర్పిడి చేస్తూ గోదాములకు తరలిస్తున్నారు. అయితే అందుకు కూడా వాతావరణం సహకరించలేదు. ఉదయం పూట తీవ్రమైన పొగమంచు కురుస్తుండటంతో వరిపంటపై తేమ ఉంటోంది. దీంతో పంట కోయడానికి కూడా అనుకూలంగా లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో పంట కోత కోసిన బియ్యం సరిగా రావని రైతులు వాపోతున్నారు. మరో వైపు పంట సాగుచేసి రేపు, మాపో కోయాలనుకున్న తరుణంలో వరిపంటకు తెగుళ్లు సోకుతు న్నాయి. ఈ సమయంలో మందులు కొడితే.. గింజలు దెబ్బతింటాయని రైతులు మిన్నకుం డిపోతున్నారు. పంట కోసిన రైతులు పొగమంచు నుంచి పంటను కాపాడుకో వడానికి ధాన్యంపై టార్పాలిన్లను కప్పి.. కాపాడుకుంటున్నారు. ఏదిఏమైనా ఈ సారీ వరిరైతులకు నష్టాలే మిగిలాయి.



దెబ్బతిన్న వరిపంట



పొగమంచుకు ధాన్యం తడవకుండా కప్పిన టార్పాలిన్

యంత్రాలతో పంట కోయలేకున్నాం..



వరిపంట కోత కోసేందుకు యంత్రాలను ఉపయోగిస్తున్నప్పటికి ఫలితం లేకుండా పోతోంది. కోసే ప్రయత్నం చేస్తుండగా పొలంలో మిషన్‌లు దిగుబడి ఇబ్బందులకు గురవుతున్నాం. ఇప్పుడు వరిపంట కోత కోసిన నాణ్యమైన బియ్యం వచ్చే పరిస్థితి లేదు.

- పోతిరెడ్డి, రైతు, తాడిమర్రి

నష్టం తప్పదు



వాతావరణం బాగలేదు. వరిపంట కోత కోస్తే నాణ్యమైన దిగుబ డి రాదు. బియ్యం నూకలుగా మారి మార్కె ట్‌లో ధర తక్కువగా పలుకుతుంది. కోయకుండా అలాగే ఉంచితే తెగుళ్లు సోకుతున్నాయి. ఉంచినా నష్టమే. పంట కోసినా నష్టమే. ఈసారి కూడా వరి పంట నష్టాలే మిగిల్చేలా ఉంది.

-పెద్దన్న, రైతు, తాడిమర్రి

రైల్వేబ్రిడ్జిపై రోడ్డు గుంతలమయం





ధర్మవరంరూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నుంచి మామిళ్లపల్లి మార్గ మధ్యలో ఉన్న పోతుకుంట రైల్వేబ్రిడ్జిపై రోడ్డు గుంతలమయమైంది. టూటౌన్ పోలీస్‌స్టేషన్, రూరల్ పోలీస్‌స్టేషన్, మామిళ్లపల్లి జాతీయ రహదారి, కుణుతూరు, పోతుకుంట గ్రామాలకు ఈ బ్రిడ్జిపై నుంచే వెళ్లాల్సి ఉంది. దీంతో ఈ బ్రిడ్జిపై నుంచి నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అయితే ఈ బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. రాత్రివేళాల్లో ఈ గుంతల వద్ద వాహనాలు అదుపుతప్పి వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. సుమారు అర కిలోమీటర్ వరకు ఉన్న ఈ బ్రిడ్జిపై ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి బ్రిడ్జిపై ఉన్న ఈ రహదారిని బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.



కొంగొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి..


ఎంపీ పార్థసారథికి శుభాకాంక్షలు తెలుపుతున్న పెనుకొండ అధికారులు

- అంతటా సందడే సందడి
- అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు
- ఆలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రార్థనలు
- నేతలు, అధికారుల కార్యాలయాల్లో కేక్ కటింగ్‌లు


విశేష అలంకరణలో కోట వెంకటేశ్వరస్వామి


మంత్రి సవితకు శుభాకాంక్షలు తెలుపుతున్న గోరంట్ల నాయకులు


ఎమ్మెల్యే రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు


మాజీ మంత్రి శంకర్‌నారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం


తెలుగుదేశంలోకి చేరిన వారితో మడకశిర ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ


పురంలో ఎమ్మెల్యే నివాసం వద్ద కేక్ కట్‌చేసి స్వీట్లు పంచుకుంటున్న టీడీపీ నాయకులు


పరిటాల సునీత, శ్రీరామ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పెనుకొండ నాయకులు

న్యూఇయర్ వేడుకలను పట్టణ, పల్లెవాసులు అందరూ ఘనంగా జరుపుకున్నారు. జిల్లా ప్రజలు కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టారు. 2024కు వీడ్కోలు చెబుతూ 2025కు ఘనస్వాగతం పలికారు. మంగళవారం అర్ధరాత్రి కేక్‌లు కట్‌చేసి టపాసులు పేల్చి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. గత యేడాది తొలి ఐదు నెలలు నిరాశతో గడిచినా తరువాత కూటమి అధికారంలోకి రావడంతో యువతలో నూతనోత్సాహం కనిపించింది. మంగళవారం రాత్రి చర్చిల్లో ప్రార్థనలు జరపగా, బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు నేతల ఇళ్లలో కేక్‌కటింగ్‌లు చేశారు. హిందూపురంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు నూతన సంవత్సర వేడుకలను కోలాహలంగా జరుపుకున్నారు. హిందూపురం ఎమ్మెల్యే నివాసం వద్దకు పట్టణ, నియోజకవర్గ నాయకులు తరలి వచ్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. అదేవిధంగా టీడీపీ, వైసీపీ, బీజేపీ, జనసేన, ముఖ్య నాయకుల ఇళ్లవద్దకు కార్యకర్తలు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో పెనుకొండ టీడీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంత్రి సవిత సూచించిన ప్రకారం బొకేలు, పూలహారాలు, శాలువాలు కాకుండా నోటుపుస్తకాలు, పెన్నులు, తదితర విద్యా సామాగ్రిని అందించి శుభాకాంక్షలు తెలిపారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వద్దకు, అగళి మండల జెడ్పీటీసీ ఉమేష్‌తోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లి శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. గుడిబండ, రొళ్ల మండలాలో కూడా వేడుకలు ఘనంగా జరిగాయి.

- న్యూస్ నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)

శ్రీశైలం నుంచి నీరిస్తే అంతే చాలు..

- నదుల అనుసంధానం శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని
- జలసాధన సమితి నాయకులు

హిందూపురం అర్బన్, జనవరి1(ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానం తీవ్ర శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని అనీ, తద్వారా రాయలసీమకు ప్రయోజనం కూడా అంతంత మాత్రమేనని జలసాధన సమితి ఉమ్మడి అనంత జిల్లా నాయకులు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం హర్షించదగ్గ విషయమేనని, ఎక్కడో పోలవరం నుంచి నల్లమల అడవుల్లో సొరంగ మార్గాలు, కాలువలు తవ్వాలంటే అధిక శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని అన్నారు. అన్నింటినీ పూర్తిచేసిన తరువాత నీరివ్వాలన్నా ఎన్నో ఇబ్బందులు తప్పవన్నారు. దాదాపు 800 కిలోమీటర్ల దూరం ఎత్తిపోతల ద్వారా కొండకోనల్లో నీరు తీసుకురావడం సాధ్యమేనా? అ ని ప్రశ్నించారు. రాయలసీమకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలనుకుంటే శ్రీశైలం డ్యాం నుంచి కాలువల ద్వారా నీరు ఇవ్వాలన్నారు. ఆ దిశగా కాలువలు వెడల్పు చేసి, అందుబాటులో ఉన్న జలాలను సక్రమంగా వినియోగిస్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. ఇప్పటికే ఏటా వందల టీఎంసీల కృష్ణాజలాలు సముద్రం పాలవుతున్నాయన్నారు. వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే చాలన్నారు. దీనిపై అన్ని రాజకీయపార్టీలు, మేధావులతో సమావేశం ఏర్పాటుచేసి, సీమకు వాటిల్లుతున్న అన్యాయాన్ని వివరిస్తామన్నారు. కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు ఓపీడీఆర్ శ్రీనివాసులు, ధనాపురం వెంకటరామిరెడ్డి, చైతన్య గంగిరెడ్డి, జమీల్, అమానుల్లా, ఉమర్‌ఫరూక్, బీఎస్పీ శ్రీరాములు, ఆదినారాయణ, పవన్, తిప్పేస్వామి, గిరీష్, సిద్దారెడ్డి పాల్గొన్నారు.


నదుల అనుసంధానం మ్యాప్‌ను చూపుతున్న సమితి నాయకులు

ఘనంగా కోరేగావ్ విజయోత్సవ ర్యాలీ

పావగడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కోరేగావ్ విజయోత్సవ ర్యాలీని పావగడ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి, విజయోత్సవ ర్యాలీకి చెందిన అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహారాష్ట్రలోని సీమా నది తీరంలో 1881లో మరాఠా పేష్వాలకు చెందిన 30 వేల మంది సైనికులు మెహర్‌జాతికి చెందిన 2500 మంది సిద్ధి నాయక సేనపై దాడికి పాల్పడగా 500 మంది సిద్ధినాయకులు ప్రాణాలు కోల్పోయారు. 25వేల మంది మట్టిలో కలవడంతో వారి జ్ఞాపకార్థంగా బీమా విజయోత్సవ ర్యాలీగా జరుపుకొంటున్నట్లు టీఎస్ఎఫ్ నాయకులు తిప్పేస్వామి తెలియజేశారు. అనంతరం కొవ్వత్తులతో ర్యాలీ విజయ సంకేతాన్ని చూపి జైభీం నినాదాలతో పలు విప్లవ గీతాలతో ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా అనేక మంది దళిత నాయకులు పాల్గొన్నారు.


కొవ్వొత్తులు వెలిగిస్తున్న దళిత సంఘం నాయకులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

ధర్మవరం రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడన్నపల్లి సమీపాన ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి బైక్ అదుపుతప్పడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ధర్మవరంలోని గీతానగర్‌కు చెందిన అంజి, వెంకటరమణ, కృష్ణ గార్లదిన్నె మండలం ముంటిమడుగుకు వెళ్లారు. బుధవారం రాత్రి ఆ ముగ్గురూ తిరిగి బైక్‌పై ధర్మవరం బయలుదేరారు. బడన్నపల్లి సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లారు. ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న వారు గమనించి.. 108 ద్వారా ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

గాండ్లపెంట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కటారుపల్లి పంచాయతీ నుంచి ఇతర ప్రాంతాల్లో కోడిపందేలు ఆడేందుకు వెళ్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ వలీబాషా బుధవారం తెలిపారు. వారి నుంచి నాలుగు కోళ్లు, రూ.18వేలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

- నూర్పిడి యంత్రాల పంపిణీలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతు మొహాల్లో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. పట్టణంలోని బాలాజీ నగర్‌లో బుధవారం సబ్సిడీపై పంట నూర్పిడి యంత్రాలను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి గుడిబండ, అమరాపురం మండలాల పరిధిలోని రైతులకు అందించారు. రూ.5లక్షల విలువగల ఈ యంత్రాలను సబ్సిడీపోను రూ.3లక్షలకే అందిస్తున్నామన్నారు. రైతులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. గత ప్రభుత్వం రైతులను అన్ని విధాలా నమ్మించి మోసగించిందని, ఈప్రభుత్వంలో రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్య నిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.


రైతులకు యంత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జనవరి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన విద్యార్థి విజయ్‌కుమార్ క్రిమిసంహారక మందు తాగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాగరాజు కుమారుడు విజయ్‌కుమార్ గోరంట్లలోని ఓప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గొర్రెలకోసం ఉపయోగించే క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉషా చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల ప్రధాన కారణం తెలియాల్సి ఉంది.

రహదారి గుంతలమయం


పెనుకొండ-మడకశిర రహదారిలో ఏర్పడిన గుంతలు

పెనుకొండ రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పెనుకొండ-మడకశిర వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. మడకశిర రహదారిలో సుంకలమ్మ ఆలయం నుంచి అడదాకులపల్లి క్రాస్ వరకు ప్రధాన రహదారిలో 2కి.మీ మేర మోకాళ్లలోతు గుంతలు ఏర్పడ్డాయి. కొన్నేళ్లుగా ఈ రహదారిలో ప్రయాణం నరకంగా మారిందని అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనుకొండకు రాకపోకలు సాగించాలంటే ప్రయాణం నరకంగా మారిం దని సమీప గ్రామస్థులు వాపోతున్నారు. కనీసం ఆర్అండ్‌బి అధికారులు రోడ్లలోని గుంతలనైనా పూడ్చాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బి ఏఈ వెంకటేశ్‌ను వివరణ కోరగా త్వరలోనే మడకశిర రహదారిలో గుంతలుపడ్డ ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడతామమని తెలిపారు.

శ్రీవారికి వెండి ఆభరణాల సమర్పణ

ధర్మవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామికి ఈనెల 10న నిర్వహించే వైకుంఠ ఏకాదశికి భక్తులు వెండి కిరీటాన్ని అందజేశారు. బుధవారం వజ్జల వెంకటరమణబాబు కుమారులు స్వామివారికి రూ.1.10 లక్షల విలువ చేసే వెండి కిరీటం, వక్షస్థల మహాలక్ష్మిని ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్‌కు అందజేశారు. స్వామి వారి పూజల్లో పాల్గొన్నారు. వారిని ఆలయం తరఫున సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

న్యూస్ బాక్స్

లేపాక్షికి పోటెత్తిన పర్యాటకులు


ఏడు శిరస్సుల నాగేంద్రుడి విగ్రహం వద్ద భక్తుల రద్దీ

లేపాక్షి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం లేపాక్షి ఆలయానికి భక్తులు, పర్యాటకులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ధ్వజస్తంభం నుంచి గర్భగుడివరకు క్యూకట్టారు. దర్శనం కోసం గంటల తరబడి బారులు తీరారు. ఏకశిల నంది విగ్రహం, జటాయువు పక్షి ఏడు శిరస్సుల నాగేంద్రునివద్ద పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆలయ అర్చకులు దుర్గా వీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో షిరిడీసాయినాథుడు

మడకశిరటౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతన సంవత్సరపు వేడుకలు అంబరాన్నంటాయి. మడకశిరలో 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సంవత్సరంలో అందరికి శుభం కలగాలని, ప్రజలంతా సుఃఖశాంతులతో ఉండాలని ఆలయాల్లో సైతం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక మంది యువకులు మడకశిర కొండపైకెక్కి రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఉదయం నుంచి పట్టణంలోని వివిధ దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బీజేపీ పట్టణ అధ్యక్షురాలిగా అంజలి


అంజలి

హిందూపురం అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ హిందూపురం పట్టణ అధ్యక్షురాలిగా 11వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అంజలిని ఎన్నుకున్నారు. బుధవారం జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఆమెను అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. ఓ మహిళ బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కావడం హిందూపురం చరిత్రలో ఇదే మొదటి సారని మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. అంజలి మాట్లాడుతూ తన ఎంపికకు పాటుపడిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, ఓబిమోర్చా జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, బీజేవైఎం సోషల్ మీడియయా కో కన్వీనర్ వినయ్ పాల్గొన్నారు.

మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రావు

పెనుకొండ టౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి) :మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో టీడీపీ నేత వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఆయన బుధవారం ఇరుజట్ల మధ్య టాస్‌వేసి టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న మంత్రి సవిత జన్మదినాన్ని పురస్కరించుకుని మెగా టోర్నమెంట్‌ను జరుపుతున్నట్లు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు రూ.50,116, ట్రోఫీ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, షౌకత్, కృష్ణమూర్తి, షమీ తదితరులు పాల్గొన్నారు.

కల్లు దుకాణాల సీజ్

పరిగి, జనవరి 1(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో అనధికారికంగా నిర్వహిస్తున్న కల్లుదుకాణాలను బుధవారం సీజ్ చేసినట్లు ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. ఈడిగ ఆంజనేయులుకు చెందిన రెండు కల్లుదుకాణాలకు లైసెన్స్‌లు కాలం చెల్లినా దుకాణాలు నడపడంతో విషయం తెలుసుకున్న డీసీ నాగముద్దయ్య, ఏసీ మునిస్వామిల ఆదేశాల మేరకు కల్లు దుకాణాలను సీజ్ చేశారు. దుకాణ నిర్వాహకులు పరారీలో ఉన్నారు. కార్యక్రమంలో స్క్వాడ్ సీఐలు హరిక్రిష్ణ, సృజన్‌బాబు పాల్గొన్నారు.

పాంచజన్య పాఠశాలలో ఘనంగా కిండర్ గార్డెన్ డే


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

హిందూపురం అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పాంచజన్య పాఠశాలలో బుధవారం కిండర్ గార్డెన్‌డే నిర్వహించారు. నూతన ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు, కరెస్పాండెంట్ నందకుమార్ ఆధ్వర్యంలో చిన్నారులు ఆటపాటలతో గడిపారు. చిన్నారులు నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ స్మిత, నందిత, హెచ్ఎం గాయత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర ఉన్నారు.